# ఆమె ఎన్నిక

గంటి సుందరీ కొండయ్య



ఆనంద్‌కు రోజూ బీచికి వెళ్లేట మంటే సరదా తన యింటికి బీచ్ దగ్గర కావటంతో ఆఫీసు పని పూర్తయిన తరువాత బీచ్‌లో దూరంగా సముద్రం - మబ్బులు కలిసినట్లుండే ప్రదేశాన్ని గంటల తరబడి చూస్తూ, వూహలు నిర్మిం చుకుంటూ వుండి పోయేవాడు.

ఆ రోజు కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలంటూ బీచ్‌కి కవితను ఆహ్వా నించాడు ఆనంద్. తన గుండెల్లో పదిలంగా దాచుకున్న యీ విషయాన్ని కదిపిమాడాలని అతని అంతరాత్మ పదే పదే తొందర పెడు తోంది. ఇన్నాళ్ళుగా కవితకు తన హృద యంలో స్థానమిచ్చాడు. తన ఆఫీసులో స్టైనోగా పనిచేస్తూ నలుగురితో కలిసి మెలిసి అరమరికలు లేకుండా నిర్మలంగా వుండే కవిత అంటే తనకు చెప్పలేని యిష్టం. ఇప్పుడు కవిత వచ్చిన తర్వాత తన మనోభావాలను వెల్లడించాలి. ఈ వూహాలోకంలో పడ్డ ఆనంద్‌కు ఎప్పుడు కవిత వచ్చిందీ తెలియలేదు. ఒక్కసారి ఆశ్చర్యపోయాడు.

దూరంగా సూర్యుడు మబ్బుచాటు చేసుకుని ఈ లోకంనుంచి వెళ్లిపోయే ప్రయత్నంలో వున్నాడు. చిరునవ్వులు చిలక రిస్తూ వచ్చిన కవిత అలాగే యిసుకలో 'హమ్మయ్య!' అంటూ కూలబడిపోయింది. ఇప్పటిదాకా ఆలోచనలతో నిమగ్నమైన ఆనంద్‌కు కవిత రావటంతోనే ఎలా తను చెప్పదలచుకున్నది చెప్పాలో బోధపడలేదు. కొద్దిసేపు వారిద్దరిమధ్య నిశ్శబ్దం రాజ్యం చేసింది. ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ కవిత.

"ఆనంద్‌గారూ! ఎందుకో రమ్మన్నారు కారణం తెలుసుకోవచ్చునా?" అంది.

"ఇన్నాళ్ళూ కవితలో ఆఫీసులో చనువుగా మాట్లాడుతూ వున్నప్పటికీ యీ విష యాన్ని ఎలా మొదలుపెట్టాలో తికమక పడిపోతున్నాడు ఆనంద్.

"కవితా! ఎన్నాళ్ళుగానో నా మనసులో పదిలంగా దాచుకున్న విషయం చెప్పే అవకాశం యిప్పటికి దొరికినందుకు నాకు సంతోషంగా వుంది. నేను రమ్మని కబురు పంపటంతోనే వచ్చావు. చాలా సంతోషము. ఇప్పుడు నా పెళ్ళికి ఎన్నెన్నో సంబంధాలు వస్తున్నట్టుగా పెద్దవాళ్ళు రాస్తున్నారు. కాని నా మనసులోని నిన్ను చేరి పి వే సి మరొకర్ని పెళ్లి చేసుకోలేను. నీవు అనుమతిస్తే…"

"మీ తల్లి దండ్రుల్ని సంప్రదించి నన్ను వివాహం చేసుకుంటానంటారు అవునా? ఆనంద్‌గారూ కాని నా నిర్ణయాన్ని తెలియజేసే ముందు నా కుటుంబ వ్యవహా రాలు చెప్పుకోవాల్సిన బాధ్యత నాపైన ఉంది అన్నీ విన్న తర్వాతే మీ నిర్ణయం తెలియజేయండి."

సరేనని ఆనంద్ తల వూపాడు.

"మా నాన్న రిటైర్డ్ స్కూల్ టీచర్. రిటైర్‌మెంటుతో పాటు కొన్ని జబ్బుల్ని ఆస్తిపాస్తులుగా సంపాదించాడు. నాకు పెళ్లి కావాల్సిన చెల్లెలొకతుంది. కుటుంబ మంతా నా మీద ఆధారపడి బ్రతుకు తున్నారు నేను మిమ్మల్ని పెళ్లి చేసుకొని యివతలకి వస్తే మా కుటుంబాన్ని ఎవరు పోషిస్తారు? మీరు బాగా ఆలోచించే ఒక నిర్ణయానికి రండి" అంది కవిత.

ఆనంద్ వెంటనే అందుకున్నాడు. "కవితా! నీవు యీ విషయంలో బెంగపడ వద్దు. నే నిప్పుడు గుమాస్తాగా నెలకు ఐదువందలు సంపాదిస్తున్నాను. ఈ డబ్బు మనకు హాయిగా సరిపోతుంది. నీ జీతంతో మీ నాన్నకు మందు మాకు యిప్పించవచ్చు మీ చెల్లెలి పెళ్ళికి కట్నం యివ్వొచ్చు."

"ఆనంద్‌గారూ! మీరు బాగా ఆలోచించే ఒక నిర్ణయానికి రండి. ప్రస్తుతానికి సెలవ్" అంటూ నిష్క్రమించింది కవిత.

* * *

కొన్ని రోజుల తర్వాత. సమయం అదే స్థలం అదే: బీచ్ వొడ్డున ఈసారి మాట్లాడుకొంటున్నది మాత్రం రాజ శేఖరం— కవిత.

రాజశేఖరం కవిత వంక చూశాడు. కవిత మోములో చిరునవ్వు ఆభరణంగా శోభి స్తోంది. కవిత చెబుతోంది.

"నా పరిస్థితులు మీకు తెలియజేశాను రాజశేఖరంగారూ! ప్రేమా, గీమా అంటూ పెళ్లికి ముందు చెట్టాపట్టాలేసుకు తిర గటం అంటే నా కిష్టంలేదు. నాకుటుంబ పరిస్థితులు మీకు చెప్పాను. ఇక మీరు బాగా ఆలోచించుకొని ఒక నిర్ణయానికి రండి."

"కవితా! ఐ యామ్ వెరీ వెరీ సారీ! మీ కుటుంబ పరిస్థితులకు నా సానుభూతి! కాని నేను మీ కుటుంబం కోసం ఎటువంటి త్యాగం చేయలేనని తెలపటానికి చింతిస్తు న్నాను. అదృష్టవశాత్తు నాకు సంపాదించే భార్య లభిస్తే పొదుపుగా జీవిస్తూ యిద్దరి సంపాదనతో ఆర్థిక యిబ్బందులు లేకుండా జీవించాలనేది నా జీవితాశయం.







**వనితలకు మనవి**

కొత్తరకం వంటలు
క్లుప్తంగా వ్రాసి పంపితే
త్వరగా పరిశీలించ వీలు —సం.

## ఆ మె ఎ న్ని క

నేను మీకు స్వార్థపరుడిగా కనబడవచ్చు. కాని నా భార్యకు ఐశ్వర్యం, హోదా సమకూర్చటమే నా ధ్యేయం. నా మాటలు కటువుగా వున్నందుకు అన్యథా భావించకండి ''

ఇద్దరూ ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు

*  *  *

'పోస్ట్' అనే కేకతో ఆనంద్ ఊహాలోకంనుంచి వూడి పడ్డాడు కవరు. కవరులోపల ఓ శుభలేఖ. లెటరు ఉన్నాయి. ఆత్రంగా విప్పిచూశాడు.

ఆనంద్ గారికి నమస్తే!

ఈ ఉత్తరంతోపాటు నా పెళ్ళి శుభలేఖ పంపుతున్నాను. మా వివాహానికి మీరు తప్పక రావలసినదిగా కోరుతున్నాను. కాని మీరు ఆశ్చర్యపోవచ్చు. మా కుటుంబానికి నా జీతాన్నే త్యాగంచేస్తానన్న మీ త్యాగబుద్ధి నన్ను ఆనందింపజేసింది కాని ఏ సినిమాలలోనో, ఏ నవలలోనో పాత్రలు త్యాగభరితమై కన్నీరు కార్పిస్తుంటే మనం ఆ పాత్రల ఆదర్శాలకు, ఔన్నత్యానికి తల ఒగ్గుతాం. కాని ఇది జీవితం త్యాగం పేరుతో ఆత్మవంచన చేసుకోవటం ... క్షణ క్షణానికి బ్రతుకులో ఏదో కోల్పోయామని బాధపడటంకంటె మించిన వంచన లేదు. ఈ విషయంలో రాజశేఖరంగారు నిష్కర్షగా తన మనోభావాలను వెల్లడించి నన్ను చేబట్టటానికి కారకులయ్యారు మీ మనోభావాలను చదవటానికి నేను కల్పించిన పాత్రలే 'రిటైర్డ్ టీచర్', 'పెళ్ళికాని చెల్లెలు'. నా పరీక్షలో నా భార్య, సంసారం, సుఖం – సంతోషం అన్న రాజశేఖరంగారు విజయలక్ష్మిని వరించారు ఇకనుంచైనా 'నేలవిడిచిన సాము' వ దు లు తా ర ని, నన్నుపార్థం చేసుకోరని విశ్వసిస్తూ,

ఎప్పటికీ మీ స్నేహితురాలు,
కవిత.

ఆనంద్ ఆ ఉత్తరం చదివి అప్రతిభుడయ్యాడు!